క్లుప్తంగా

విద్యార్థికి సైకిల్ అందజేత



విద్యార్థికి సైకిల్‌ను అందజేస్తున్న తాతీలు

కరప: గ్రామంలోని నక్కా సూర్యనారాయణమూర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కరప గ్రామానికి చెందిన పేపకాయల యశ్వంత్ ఏడో తరగతి చదువుతున్నాడు. బాగా చదువుకుంటున్న అతడు పాఠశాలకు వెళ్లేందుకు సైకిల్ కావాలని మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలును కోరాడు. ఈ విషయాన్ని ఆయన కాకినాడలోని డాక్టర్ శ్రీహరి బాబు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందించి రూ.6 వేల విలువైన సైకిల్‌ను సమకూర్చారు. దానిని శనివారం విద్యార్థి యశ్వంత్‌కు మాజీ సర్పంచ్ తాతీలు అందజేశారు.

గణేశ్ పంచరత్న పోటీల వేదిక మార్పు

బోట్‌క్లబ్: వినాయక చవితి సందర్భంగా భరద్వాజ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం గణేశ్ పంచరత్న స్తోత్రంపై 5 నుంచి 15 ఏళ్ల పిల్లలకు పోటీలు నిర్వహిస్తున్నట్లు సంఘ అధ్యక్షులు డాక్టర్ ఐవీ రావు, కార్యదర్శి ముంజులూరి విశ్వేశ్వరరావు శనివారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. పోటీలకు వచ్చే వారు అధికంగా ఉన్న దృష్ట్యా పోటీల వేదికను మార్పు చేసినట్లు చెప్పారు. ఎస్‌ఎఫ్‌సీఎల్ రోడ్డులోని జిల్లా క్రీడా మైదానం సమీపంలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ)భవన ప్రాంగణంలో పోటీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి అధిక సంఖ్యలో చిన్నారులు వస్తున్నారన్నారు. భారతీయ ఇతిహాస పురాణాల ప్రభావాన్ని పరిచయం చేయాలన్నదే లక్ష్యమన్నారు. గణేశ పంచరత్న స్తోత్రాలను శ్రావ్యంగా ఆలపించిన వారికి బహుమతులతో పాటు, కన్సోలేషన్ బహుమతులు ఇస్తామన్నారు.

డీఎస్సీలో ఎఫ్‌ఎన్‌ఓ వీరవేణికి 19వ ర్యాంక్



ఉందుర్తి వీరవేణి

కరప: బీఎస్సీ(సీబీజెడ్) చదివిన ప్రభుత్వాసుపత్రిలో ఆమె ఓ సాధారణ ఉద్యోగి. డీఎస్సీ ద్వారా మంచి ఉద్యోగం సాధించాలన్న పట్టుదలతో రోజుకు 14 గంటలు కష్టపడి చదివి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా డీఎస్సీలో 19వ ర్యాంక్ సాధించారు. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలం వెంటూరు గ్రామానికి చెందిన ఉందుర్తి వీరవేణి కుటుంబం కరపలో నాలుగేళ్లుగా నివసిస్తోంది. కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో ఎఫ్‌ఎన్‌ఓ(ఫిమేల్ నర్సింగ్ ఆర్డర్లీ)గా వీరవేణి పనిచేస్తున్నారు. ఆమె భర్త భరత్‌కుమార్ పాత్రికేయుడు. కుమారుడు డిప్లమో, కుమార్తె ఇంటర్మీడియెట్ చదువుతున్నారు. వీరవేణి పనిచేస్తూనే నిత్యం 14 గంటల పాటు ప్రణాళికాబద్ధంగా చదివి డీఎస్సీ రాశారు. శుక్రవారం ప్రకటించిన డీఎస్సీ ఫలితాల్లో 19వ ర్యాంక్ సాధించారు. బయాలజికల్ సైన్స్ విభాగంలో ఆమె స్కూల్ అసిస్టెంట్ పోస్టుకు ఎంపికయ్యారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

బాలాజీచెరువు: రక్తదానం ప్రాణదానంతో సమానమని ఆదిత్య డిగ్రీ కళాశాల కో–ఆర్డినేటర్ డాక్టర్ బీఈవీఎల్ నాయుడు అన్నారు. కళాశాలలో శనివారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నాయుడు మాట్లాడుతూ, మొదటిసారి రక్తదానానికి 23 మంది స్వచ్ఛందంగా రావడం సంతోషదాయకమన్నారు. ఆరోగ్యవంతులు ఏడాదికి మూడుసార్లు రక్తదానం చేయవచ్చన్నారు. అనంతరం శిబిరంలో సేకరించిన 65 యూనిట్ల రక్తాన్ని జీజీహెచ్ బ్లడ్‌బ్యాంక్ వైద్యులు అనిల్‌కు అందజేశారు.

మహిళలు డిజిటల్ సాధికారతను సాధించాలి

తాళ్లరేవు: మహిళలు డిజిటల్ సాధికారతను సాధించాలని భీమాబాయి మహిళా మండలి చీఫ్ ఫంక్షనరీ వాసంశెట్టి నందివర్ధన తెలిపారు. శనివారం జార్జిపేట గ్రామంలో భీమాబాయి మహిళా మండలి ఆధ్వర్యంలో మహిళలకు, యువతులకు డిజిటల్ సాధికారితపై వివరించారు. ఈ సందర్భంగా నందివర్ధన మాట్లాడుతూ, సైబర్ నేరాలు, సైబర్ దుర్వినియోగం అయ్యే పరిస్థితులను కూలంకషంగా వివరించారు. ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ లోవరాజు మాట్లాడుతూ, మహిళా మండలి ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. సమాజంలో తీవ్రతరమవుతున్న సైబర్ నేరాలపై మహిళలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.



కరప–పెనుగుదురు మధ్య ఇలా..



పాతర్లగడ్డ సమీపంలో రోడ్డు పక్కన వ్యర్థాలు



వలసపాకల–వేములవాడ గ్రామాల మధ్య..

రహదారుణం

- అధ్వానంగా ఉన్న రోడ్డు మార్జిన్లు
- పెరిగిపోయిన ముళ్లపొదలు
- గాయాల పాలవుతున్న వాహనదారులు

కరప: మండలంలోని ప్రధాన రహదారుల వెంబడి పిచ్చిమొక్కలు, ముళ్లపొదలు పెరిగిపోయి అడవులను తలపిస్తున్నాయి. రోడ్డు మార్జిన్లలో ముళ్లపొదలు పెరిగిపోవడంతో రాకపోకలు సాగించేందుకు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనచోదకులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు మార్జిన్లలో ఉండే ముళ్లపొదలను తొలగించేందుకు చర్యలు తీసుకోవడంలో అధికారులు చూపుతున్న నిర్లక్ష్యంపై ప్రజల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది.

రోడ్డు అంచుల వెంబడి..

కాకినాడ–రావులపాలెం ప్రధాన రహదారి నడకుదురు, పెనుగుదురు, కరప, వలసపాకల, వేములవాడ, పెదకొత్తూరు, వేళంగి గ్రామాల మీదుగా ఉంటుంది. పెనుగుదురు నుంచి కోటిపల్లి వెళ్లే రహదారి, కరప నుంచి అరట్లకట్ట వెళ్లే రోడ్డు, వేములవాడ నుంచి గొర్రిపూడి వెళ్లే ఏటిగట్టు రోడ్డు, వేళంగి నుంచి వెళ్లే కాపవరం రోడ్డు, యండమూరు నుంచి వెళ్లే జి.భావారం రోడ్డు, నడకుదురు నుంచి యానాం రోడ్డుకు వెళ్లే గురజనాపల్లి రోడ్డు మండల పరిధిలో ఉన్నాయి. ఆయా గ్రామాల మధ్యలో ఈ రహదారుల పొడవునా రోడ్డు అంచుల వెంబడి పిచ్చిమొక్కలు, చెత్తాచెదారాలతో నిండిపోయాయి.

జాగా లేకుండా..

రహదారులన్నీ ముళ్లపొదలతో భయంకరంగా తయారయ్యాయి. వీటికితోడు గ్రామాల వద్ద చెత్త కుప్పలు రోడ్డు మార్జిన్లలో వేయడం వల్ల పక్కకు జరిగి వెళ్లేందుకు జాగా లేకుండా పోయింది. ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించుకునేందుకు ద్విచక్ర వాహనచోదకులు పక్కకు జరిగితే.. రోడ్డు మార్జిన్లలో ఉండే ముళ్లపొదలు గీరుకుని గాయాల పాలవుతున్నారు. పాదచారులకు కూడా ఇబ్బందికరంగా ఉంటోంది.

పట్టించుకోని యంత్రాంగం

రోడ్డు మార్జిన్లలో జంగిల్ క్లియరెన్స్ పేరుతో తుప్పలు, పిచ్చిమొక్కలు తొలగించే వారని, ప్రస్తుతం అడవిలా పెరిగిపోయినా సంబంధిత శాఖల అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదంటున్నారు. హెల్మెట్ ఉంటే ప్రాణాపాయం నుంచి తప్పించుకోవచ్చని, ముళ్లపొదల వల్ల గాయాల నుంచి తప్పించుకోలేకపోతున్నామని కరప, వేములవాడ, పెదకొత్తూరు సర్పంచ్‌లు సాదే ఆశాజ్యోతి, కమిడి మంగాదేవి, చింతా నాగలక్ష్మి తెలిపారు. అధికారులు స్పందించి రోడ్డు మార్జిన్లలో పెరిగిపోయిన తుప్పలు, ముళ్లపొదలను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



కరప సమీపంలో రోడ్డు అంచున ఇలా..

గాయాల పాలవుతున్నాం



రోడ్డు మార్జిన్లలో ముళ్లపొదలు, తుప్పలు విపరీతంగా పెరిగిపోయాయి. ఎదురుగా వచ్చే బస్సులు, లారీలు వంటి భారీ వాహనాలను తప్పించుకునేందుకు రోడ్డు పక్కకు వెళితే.. మార్జిన్లలో పెరిగిపోయిన ముళ్లపొదలు గీరుకుపోయి కాళ్లు, చేతులకు గాయాలవుతున్నాయి. అధికారులు స్పందించి రోడ్డు పక్కన అడవిలా పెరిగిపోయిన మొక్కలను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలి.

– పెంకే సత్తిబాబు, కరప

ముళ్లపొదలు తొలగించాలి



రహదారుల వెంబడి ముళ్లపొదలు, పిచ్చి మొక్కలు అడవిలా పెరిగిపోయాయి. రోడ్లపై ప్రయాణం చేయాలంటే భయమేస్తోంది. ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించుకోవడానికి జాగా లేక ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి ఉపాధిహామీ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని రోడ్డు మార్జిన్‌లో పెరిగిపోయిన ముళ్లపొదలు తొలగించే చర్యలు తీసుకోవాలి.

– చోడిశెట్టి చంటి, పెద కొత్తూరు

నీరు నిల్వ లేకుండా చర్యలు చేపట్టాలి



కరపలో ప్రతిజ్ఞ చేయిస్తున్న డిప్యూటీ ఎంపీడీఓ శ్రీనివాసరావు

కరప: అంటువ్యాధులకు కారకమైన దోమలు పెరగకుండా గ్రామాల్లోని డ్రైన్లలో, వీధుల్లో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని డిప్యూటీ ఎంపీడీఓ ఎస్‌వీ శ్రీనివాసరావు అన్నారు. స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో డ్రైన్లలో నీరు నిల్వలేకుండా పూడికలు తొలగించాలన్నారు. దోమలు పెరిగే మురికినీటి కుంటలను పూడ్చాలన్నారు. దోమల నివారణ మందును పిచికారీ చేయించాలన్నారు. మాన్‌సూన్ హైజీన్ (వర్షాకాల పరిశుభ్రత) కార్యక్రమాన్ని మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో నిర్వహించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా పంచాయతీ, సచివాలయ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. పంచాయతీ కార్యదర్శి యు.నిర్మలాదేవి, ఇతర అధికారులు పాల్గొన్నారు. వివిధ గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు, యానిమేటర్లు, గ్రామస్తులు స్వచ్ఛ ర్యాలీలు నిర్వహించారు.

ఆఫర్ లెటర్ల అందజేత

బాలాజీచెరువు: ప్రభుత్వ ఐటీఐలో చదివి, మల్టీనేషనల్ కంపెనీల్లో ఉద్యోగాలు పొందిన విద్యార్థులకు శనివారం ఆఫర్ లెటర్లు అందజేశారు. ఈ సందర్భంగా కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం వెంకటేశ్వరరావు వారిని అభినందించారు. విద్యార్థులకు చదువుతో పాటు, ఉపాధి కల్పించడానికి కృషి చేస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ వర్మను అభినందించారు.

జాతీయ విద్యా విధానంపై వర్క్‌షాప్



కార్యక్రమంలో మాట్లాడుతున్న గుంత లక్ష్మణ్

బాలాజీచెరువు: ఐక్యూఏసీ ఆధ్వర్యంలో స్థానిక పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ–2020పై శనివారం వర్క్‌షాప్ జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ కందుల ఆంజనేయులు అధ్యక్షత వహించారు. అఖిల భారతీయ శైక్షిక మహా సంఘ్ జాతీయ నిర్వహణ కార్యదర్శి గుంత లక్ష్మణ్ పాల్గొన్నారు. జాతీయ విద్యా విధానంలో వచ్చిన మార్పులను వివరించారు. విద్యారంగంలో వచ్చిన మార్పులు, పరిశ్రమలకు అనుబంధంగా సిలబస్ రూపకల్పన వంటి వాటిపై చర్చించారు. వివిధ ప్రాంతాల కళాశాలలకు చెందిన 185 మంది అధ్యాపకులు జాతీయ విద్యా విధానంపై తమ అభిప్రాయాలు, సూచనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ ఉమేష్ చతుర్వేది, నన్నయ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఉదయభాస్కర్, ఏయూ ప్రొఫెసర్ మదన్‌మోహన్, జేఎన్‌టీయూకే రిటైర్డ్ ప్రొఫెసర్ అబ్బయ్య, ఐక్యూఏసీ కో–ఆర్డినేటర్ డాక్టర్ పసుపులేటి హరిరామప్రసాద్ పాల్గొన్నారు.

యానిమేటర్ నియామకంపై డ్వాక్రా మహిళల ఆందోళన



అవంతినగర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న డ్వాక్రా మహిళలు

కాకినాడ రూరల్: తిమ్మాపురం గ్రామం అవంతినగర్‌లో డ్వాక్రా మహిళలు శనివారం ఆందోళన చేపట్టారు. తిమ్మాపురం–4 వీఓఏ పోస్టు ఖాళీ కావడంతో భర్తీ చేసేందుకు సూర్యతేజ డ్వాక్రా సంఘ సభ్యురాలు సైనబరపు దేవిని యానిమేటర్(వీఓఏ)గా నియమించాలని డ్వాక్రా సంఘాల మహిళలు సమావేశమై తీర్మానించారు. ఈ తీర్మానం వివరాలు స్త్రీశక్తి భవనంలో వెలుగు ఏపీఎం, సీసీలకు అందజేశారు. ఆమెను ఆమోదించినట్టు తెలిపి, తర్వాత మరో మహిళ పేరును గ్రామ రాజకీయ నాయకులతో కుమ్మక్కై అధికారులు వెలుగులోకి తీసుకురావడంపై మహిళలు ఆందోళన చేపట్టారు. గ్రామ సంఘం తీర్మానాన్ని విస్మరించి, ఇష్టం వచ్చినట్టు యానిమేటర్‌ను నియమిస్తే ఊరుకోబోమని డ్వాక్రా మహిళలు సూరంపూడి దుర్గ, కుమారి, లక్ష్మి, తదితరులు మీడియాకు చెప్పారు. సోమవారం జిల్లా కలెక్టరు కార్యాలయంలో ఏపీఎం, సీసీలపై ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

వెలిగిన వీధి లైట్లు



మరమ్మతుల తర్వాత వెలుగుతున్న వీధి లైటు



కాకినాడ లీగల్: నగరంలోని రామారావుపేట వేలమూరివారి వీధిలో వీధిలైట్లు వెలగకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయాల్లో ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు భీతిల్లుతున్నారు. దీనిపై 'వెలగని వీధి లైట్లతో ఇక్కట్లు' అనే శీర్షికన శుక్రవారం 'సాక్షి'లో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. వేలమూరివారివీధిలో వెలగని వీధి లైట్లకు మరమ్మతులు చేశారు. వీధి లైట్లు వెలగడంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు.

అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న కళాశాల ఎండీ సంధ్య

బోట్‌క్లబ్: మహిళలు అన్ని రంగాల్లో రాణించవచ్చని చైతన్య విద్యాసంస్థల వైస్ చైర్మన్ కలిదిండి బదరీ లక్ష్మి అన్నారు. స్థానిక గాంధీనగర్ క్షత్రియ పరిషత్ కమ్యూనిటీ హాల్లో శనివారం క్షత్రియ పరిషత్ మహిళా విభాగం ఆరో వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. మహిళ ఆరోగ్యంగా ఉంటే.. ఆ కుటుంబం.. తద్వారా సమాజం ఎంతో ఆరోగ్యంగా ఉంటుందన్నారు. మహిళలు ఇంటి పనులే కాకుండా వివిధ రంగాల్లో రాణిస్తున్నారన్నారు. వీఎస్ లక్ష్మీ కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ సంధ్య మాట్లాడుతూ, క్షత్రియ మహిళలు వివిధ రంగాల్లో రాణిస్తున్నారని, ఆయా రంగాలకు చెందిన వారికి అవకాశం ఇవ్వాలని కోరారు. క్షత్రియ మహిళా విభాగం అధ్యక్షురాలు పెన్మత్స పార్వతి మాట్లాడుతూ, నిరుపేదలైన క్షత్రియ సామాజిక వర్గానికి చెందిన విద్యార్థులకు ప్రతి ఏటా క్రమం తప్పకుండా స్కాలర్‌షిప్‌లు, అనేక సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు వివరించారు. విభాగం కార్యదర్శి ఇందుకూరి దేవీవర్మ మాట్లాడుతూ, మహిళా విభాగాన్ని మరింత విస్తరించనున్నట్లు చెప్పారు. నూతన సభ్యులు మరిన్ని సేవా కార్యక్రమాలు చేయనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా కిమ్స్ ఆసుపత్రి ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. క్షత్రియ మహిళల వ్యాపార ఉత్పత్తులను ప్రదర్శించారు. వినాయక చవితి సందర్భంగా సభ్యులకు మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు దాట్ల పార్వతి, వాత్సవాయి లక్ష్మీదేవి, శేషుకుమారి పాల్గొన్నారు.

మట్టి వినాయక ప్రతిమల పంపిణీ



మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తున్న సభ్యులు

కాకినాడ రూరల్: బోట్‌క్లబ్ ఉద్యానవనంలో శనివారం మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. బోట్‌క్లబ్ ఉద్యానవనం వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. మట్టి ప్రతిమల వినియోగంపై అవగాహనతో పాటు, రసాయనాలతో కూడిన విగ్రహాల వల్ల కలిగే అనర్థాలపై పలువురు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రతినిధి కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై ఉధృత పోరాటాలు

- సీపీఎం జిల్లా కమిటీ పిలుపు



కార్యక్రమంలో మాట్లాడుతున్న రాంభూపాల్

కాకినాడ సిటీ: ప్రజా సమస్యలపై పోరాటాలను ఉధృతం చేయాలని సీపీఎం కాకినాడ జిల్లా కమిటీ పిలుపునిచ్చింది. శనివారం సీపీఎం కాకినాడ జిల్లా పార్టీ సభ్యులకు రాజకీయ శిక్షణ తరగతులను స్థానిక సుందరయ్య భవన్‌లో నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి కరణం ప్రసాదరావు ప్రిన్సిపాల్‌గా వ్యవహరించారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వి.రాంభూపాల్ మాట్లాడుతూ, కేంద్రంలో మోదీ ప్రభుత్వం మతం పేరుతో ప్రజల మధ్య చీలికలు తీసుకొచ్చి, మతోన్మాదం ప్రోత్సహిస్తోందని విమర్శించారు. ప్రభుత్వ రంగాన్ని విచ్ఛిన్నం చేస్తూ, ప్రైవేటీకరణను వేగవంతం చేస్తూ, జాతి సంపదను కొన్ని బడా కంపెనీలకు ధారాదత్తం చేస్తోందన్నారు. అంబానీ, అదాని తదితర కార్పొరేట్ శక్తులకు రూ.లక్షల కోట్ల రాయితీలు ఇస్తూ, ప్రజలపై భారాలను మోపుతున్నారని విమర్శించారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ముక్కలు చేస్తూ అమ్మేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం చోద్యం చూస్తోందని మండిపడ్డారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఉద్యమాలు చేయాలని, ప్రతి పార్టీ సభ్యుడు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు మంతెన సీతారాం మాట్లాడుతూ, విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా ఈ నెల 28న ప్రతిజ్ఞా దినంగా జరపాలన్నారు. విద్యుత్ వినియోగం పెరగకపోయినా బిల్లులు ఎందుకు ఎక్కువగా వస్తున్నాయో ప్రజలకు వివరించాలని చెప్పారు. ఖరీఫ్ సీజన్‌లో యూరియా కొరత ఎక్కువగా ఉండటంతో ప్రభుత్వం వెంటనే రైతులకు ఎరువుల సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పంటల బీమా సరిగా అమలు చేయడం లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు దువ్వా శేషుబాబ్జీ, జి.బేబీరాణి, కేఎస్ శ్రీనివాస్, ఎం రాజశేఖర్, పలివెల వీరబాబు, సీహెచ్ రాజ్‌కుమార్, సీహెచ్ రమణి, నీలపాల సూరిబాబు, టి.ఈశ్వరరావు, వివిధ మండలాల నాయకులు పాల్గొన్నారు. తొలుత కేరళ మాజీ ముఖ్యమంత్రి, సీపీఎం నాయకుడు వి.అచ్యుతానందన్, సీపీఐ మాజీ అఖిల భారత ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకరరెడ్డి, పశ్చిమ బెంగాల్ మాజీ మంత్రి దీపక్‌బాకువా మృతికి సంతాపం ప్రకటించింది.

ప్రమాదకరంగా చీడీలపార డ్రైన్



కూలిపోయిన డ్రైనేజీ రక్షణ గోడ

కాకినాడ లీగల్: చీడీలపార డ్రైనేజీ ప్రమాదకరంగా మారింది. డ్రైనేజీ రక్షణ గోడ పలు ప్రాంతాల్లో కూలిపోయింది. డ్రైనేజీని అనుకున్న రహదారిపైనే పాదచారులు, వాహనదారులు, చిన్నారులు సైకిళ్లపై ప్రయాణిస్తున్నారు. అశోక్‌నగర్ నుంచి ఇంద్రపాలెం ఉప్పుటేరులో కలిసే ఈ చీడీలపార డ్రైన్‌కి పలుచోట్ల రక్షణ గోడ లేకపోవడం, కొన్నిచోట్ల రక్షణ గోడ కూలిపోవడంతో ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ డ్రైన్‌కు రక్షణ గోడ నిర్మించాలని వారు కోరుతున్నారు.


ఘనంగా ఆర్‌ఎంసీ మెన్స్ హాస్టల్ డే



మెన్స్ హాస్టల్ డేలో పాల్గొన్న డాక్టర్ నరసింహం, డాక్టర్ విష్ణువర్ధన్ తదితరులు

కాకినాడ క్రైం: కాకినాడ రంగరాయ విద్యార్థుల ఆధ్వర్యంలో స్థానిక ఆర్‌ఎంసీ పురుషుల వసతి గృహ ఆవరణలో శనివారం మెన్స్ హాస్టల్ డే నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విష్ణువర్ధన్ పర్యవేక్షణలో వైద్య విద్యార్థుల ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం ఈ కార్యక్రమం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా రాష్ట్ర డీఎంఈ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం సతీసమేతంగా హాజరయ్యారు. డాక్టర్ నరసింహం, డాక్టర్ విష్ణువర్ధన్ మాట్లాడుతూ, ఆర్‌ఎంసీ మెన్స్ హాస్టల్ నిర్మాణానికి ఆరు ఎకరాల స్థలాన్ని దానమిచ్చి పాటమర్తి వెంకన్న వైద్య విద్యార్థుల పాలిట ప్రత్యక్ష దైవంగా మారారన్నారు. 2022 నుంచి 2025 మధ్య డీఎంఈ డాక్టర్ నరసింహం ఆధ్వర్యంలో ఏడాదికి రూ.20 లక్షల చొప్పున మొత్తం రూ.60 లక్షలు వెచ్చించి వసతి గృహాన్ని తీర్చిదిద్దామన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులకు రెండు గెస్ట్ రూమ్‌లను నిర్మించామని ప్రిన్సిపాల్ డాక్టర్ విష్ణువర్ధన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్య కుమారి, వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ శశి, డాక్టర్ ఉమామహేశ్వరరావు, స్పోర్ట్స్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ జీఎస్ ముఖర్జీ, ఆర్‌ఎంసీ లేడీస్ హాస్టల్ వార్డెన్ డాక్టర్ లలిత, క్యాంపస్ ఆఫీసర్ డాక్టర్ సతీష్, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం హాస్టల్ ఆవరణలో కొబ్బరి మొక్కలు నాటారు.

తొలి తిరుపతికి పోటెత్తిన భక్తులు



పూజలందుకుంటున్న శృంగార వల్లభ స్వామి

పెద్దాపురం: మండలంలోని తొలి తిరుపతి స్వయంభూ శృంగార వల్లభుడి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. ఆలయ ఈఓ వడ్డి శ్రీనివాస్ ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. స్వామి వారిని అర్చకులు పెద్దింటి నారాయణాచార్యులు, పురుషోత్తమాచార్యులు పూలమాలతో అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలోని వివిధ సేవల టిక్కెట్లు, అన్నదానం, కేశ ఖండన ద్వారా స్వామి వారికి రూ.2.15 లక్షల ఆదాయం సమకూరినట్లు ఈఓ శ్రీనివాస్ తెలిపారు. సుమారు 12 వేల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారన్నారు.

ఇన్‌చార్జి లేకపోవడంపై 'తమ్ముళ్ల' అసంతృప్తి

కరప: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నా, కాకినాడ రూరల్ నియోజకవర్గంలో టీడీపీ ఇన్‌చార్జి లేకపోవడంతో ఏ పనీ చేయించుకోలేకపోతున్నామని ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు అసంతృప్తి వ్యక్తం చేశారు. వేళంగిలోని టీడీపీ సీనియర్ నాయకుడు చుండ్రు వెంకన్నరావు చౌదరి ఇంటి వద్ద శనివారం పార్టీ మండల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో పనులు చేయించుకోగలిగామని, ఇప్పుడు అధికారంలో ఉండి కూడా ఏమీ చేయించుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ నేతలకు చెందిన లేఅవుట్లకు జనసేన వారికి ఎకరానికి రూ.3 లక్షలు ఇవ్వనిదే ట్రాక్టర్ మట్టి కూడా వేయించలేకపోతున్నామని, ఇంతటి గడ్డు పరిస్థితి ఎప్పుడూ చూడలేదని వాపోయారు. ప్రజలతో సత్సంబంధాలు ఉన్నవారిని, నియోజకవర్గ సమస్యలు తెలిసున్నవారిని పార్టీ అధిష్టానం నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించాలని కోరారు. ఇదే విషయాన్ని పార్టీ జిల్లా నాయకుల దృష్టికి తీసుకెళ్లనున్నట్టు తెలిపారు.

శ్రీపాద వల్లభుడికి లక్ష తులసి పూజ

పిఠాపురం: పట్టణంలోని శ్రీపాద శ్రీవల్లభ మహాసంస్థానంలో వల్లభ స్వామి వారి సప్తాహ మహోత్సవాలు మూడు రోజులుగా వైభవంగా నిర్వహిస్తున్నారు. సప్తాహ మహోత్సవాల్లో భాగంగా శనివారం స్వామి వారికి లక్ష తులసి పూజ నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ అధికారులు భక్తులకు అన్నప్రసాదాలు ఏర్పాటు చేశారు.

నేడు పి.మల్లవరంలో రంగా విగ్రహావిష్కరణ

తాళ్లరేవు: పేద, బడుగు, బలహీనవర్గాల సంక్షేమం కోసం నిరంతరం పోరాడిన యోధుడు దివంగత వంగవీటి మోహనరంగా విగ్రహాన్ని ఆదివారం పి.మల్లవరం పంచాయతీలో ఆవిష్కరించనున్నారు. స్థానిక రామాలయం వద్ద ఏర్పాటు చేసిన విగ్రహాన్ని ఆయన తనయుడు, యువ నాయకుడు వంగవీటి రాధాకృష్ణ ఆవిష్కరిస్తారని పి.మల్లవరం రంగా అభిమాన సంఘం ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాపు నేతలు హాజరు కానున్నట్టు చెప్పారు.